www.jananinadam.com RNI NO.TELTEL /12314

# జననినాదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం - సామాన్యుడి అయుధం Follow :

Simultaneously published from Asifabad & Hyderabad. | ఎడిటర్ జాధవ్ రోహిదాస్ | సంపుటి : 1 సంచిక:202 | గురువారం 19-12- 2024 | పేజీలు: 5 వెల: రూ.3.00



విలెకర్లు కావలెను

జననినాదం

ప్రతి అక్షరం సామాన్యుడి అయుధవ తెలుగు దినపత్రిక

సమాజం,స్థానిక రాజకీయ అంశాలపట్లకనీసం అవగాహన కలిగి ఉండి చక్కని రాత,ఓర్పు,నేర్పుగల జర్సలిస్టులకు (జననినాదం) తెలుగుదినపత్రిక ఆహ్వానం పలుకుతోంది. ఆసిఫాబాద్ జిల్లాలో పాత్రికేయులుగా ప్రతిభను చాటేందుకు అసక్తిగల వారు సంప్రదించగలరు.

సంప్రదించాల్సిన నెంబర్ 9550100197 9490111460




## అదానీ-మోడీ సంబంధం..

## దెబ్బతీస్తున్న దేశం ప్రతిష్ఠ..

### చలో రాజ్‌భవన్ కార్యక్రమం
### రోడ్డు పై బైఠాయించిన కాంగ్రెస్ నేతలు
### బీఆర్ఎస్‌పై మండిపాటు: సీఎం రేవంత్

హైదరాబాద్ : అదానీ-మోడీ సంబంధం దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి రాజ్ భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అదానీ వ్యాపారాలు, మోడీ ప్రభుత్వం మీద కాంగ్రెస్ పార్టీ పెద్ద స్థాయిలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో రాజ్ భవన్ కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెక్లెస్ రోడ్డు నుంచి కాలినడకన రాజ్ భవన్ వద్దకు కాంగ్రెస్ నేతలు చేరుకున్నారు.

రోడ్డు పై బైఠాయింపు: ఈ క్రమంలో రోడ్డుపై బైఠాయించిన కాంగ్రెస్ నేతలు.. అదానీ, మణిపూర్ ఘటనలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పార్లమెంట్ లో ఈ అంశాలపై చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాజ్ భవన్ ముట్టడికి వెళ్తున్న తమను హైదరాబాద్ పోలీసులు కూతవేటు దూరంలో అడ్డుకున్నారని..

## ఖాకీ చొక్కాలతో అసెంబ్లీకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, డిసెంబర్ 18 : ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆటో డ్రైవర్లకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంఘీభావం తెలిపారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోరుతూ.. ఖాకీ చొక్కాలు ధరించి తెలంగాణ అసెంబ్లీకి బయల్దేరారు. ఆటో కార్మికులను ఆదుకోవాలంటూ ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. కాగా, ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు.



## ఆటో డ్రైవర్లను ఆదుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం




## రాష్ట్రంలో చలి తీవ్రత

## సింగిల్ డిజిట్‌కే పడిపోయిన ఉష్ణోగ్రతలు

## వణుకుతున్న ప్రజలు



## ధరణి స్థానంలో భూ భారతి

- ఇక పక్కాగా రెవెన్యూ రికార్డులు
- ప్రజలకు భరోసానిచ్చేలా కొత్త చట్టం
- ధరణి సమస్యలకు చెక్ పెట్టే విధంగా మార్పులు
- అన్ని వర్గాలతో చర్చలు..సలహాలతో కొత్త చట్టం
- వివాదాల పరిశీలనకు కొత్తగా ట్రిబ్యునల్ ఏర్పాటు
- గ్రామానికో రెవెన్యూ అధికారి నియామకం
- అసెంబ్లీలో కొత్త రెవెన్యూ చట్టం తెచ్చిన ప్రభుత్వం
- గత పాలకుల ధరణి మోసాలను ఎండగట్టిన పొంగులేటి

జననినాదం, హైదరాబాద్, : ధరణిలో జరిగిన అవతవకలను అరికట్టి, రైతులకు న్యాయం చేయాలన్న సంకల్పం తోనే భూభారతిని తీసుకుని వస్తున్నామని రెవె న్యూశాఖ మంత్రి పొంగులేటి తెలిపారు. భేషజాల కు పోయి 'ధరణి'ని మార్చడం లేదని.. ప్రజాసమ స్యల పరిష్కారానికే ఆ పోర్టల్‌ను రద్దు చేస్తున్నామ ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పోర్టల్ వల్ల 4 నెలలు రిజిస్ట్రేన్లు జరగలేదన్నారు. శాసనసభలో 'భూభారతి' బిల్లును పొంగులేటి ప్రవేశపెట్టారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడారు. 'ధరణితో అనేక మంది ఇబ్బందులు పడిన మాట వాస్తవం. ఆ పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామని హామీ ఇచ్చాం.. ఇప్పుడు వేస్తున్నాం. ధరణి స్థానంలో భూభారతిని తీసుకొస్తున్నాం. భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు లిఖితపూర్వకంగా సూచించిన అంశాలను పొందుపరిచాం. ముసాయిదా బిల్లు ను 40 రోజులు వెబ్‌సైట్‌లో ఉంచాం. ఎమ్మెల్యేలు, మేధావులు ఇచ్చిన అంశాలను డ్రాఫ్ట్‌లో పెట్టాం. రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో ఒకరోజు చర్చ కూడా నిర్వహిం చాం. 18 రాష్ట్రాల్లో ఆర్ఓఆర్ చట్టాలను పరిశీలి ంచి భూభారతి తీసుకొచ్చాం. ప్రతి గ్రామా నికి ఓ రెవెన్యూ అధికారిని నియమిస్తాం. భూ వివాదాల పై అప్పీలుకు ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తాం. అనుభవ దారుల కాలాన్ని కూడా ఈ కొత్త బిల్లులో పొందుపరిచాం. 33 మాడ్యూల్స్‌తో ఉన్నదాన్ని 6 మాడ్యూల్స్‌తో పునఃప్రక్షాళన చేస్తున్నాం'అని పొంగులేటి సభలో వివరించారు. తెలంగాణలో సామాన్యుల భూహక్కుల పరిరక్షణే ధ్యేయంగా 2024 ఆర్వోఆర్ -భూభారతి చట్టాన్ని రూపొందించామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.



## జమ్మూ కాశ్మీర్‌లో..

## అగ్ని ప్రమాదం

### - ఆరుగురు మృతి

కథువా: జమ్మూ కాశ్మీర్‌లోని కథువాలో బుధవారం తెల్లవారు జామున ఓ ఇంట్లో మంటలు చెలరేగడంతో ఇద్దరు చిన్నారులు సహా ఆరుగురు వ్యక్తులు ఊపిరాడక మరణించారని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు ఆసుపత్రి పాలయ్యారని వారు తెలిపారు. జిల్లాలోని శివ నగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో ఉన్నవారు నిద్రిస్తున్న సమయంలో దట్టమైన పొగలు వ్యాపించాయి. తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో స్థానికులు మంటలను గమనించి ఇంటికి చేరుకున్నారని అధికారులు తెలిపారు. బాధితులను కతువాలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించగా, ఇద్దరు మైనర్‌లతో సహా ఆరుగురు మరణించినట్లు ప్రకటించారు. "పది మందిని ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆరుగురు చనిపోయారు, మరో నలుగురు గాయపడ్డారు" అని ఆసుపత్రిలోని సీనియర్ డాక్టర్ చెప్పారు. పొగ పీల్చడంతో ఊపిరాడక బాధితులు చనిపోయారని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని, కాలిన గాయాలు ఏవీ నివేదించలేదని డాక్టర్ తెలిపారు.



## మూసీ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు

- పదేళ్ల పాలనలో ఏనాడూ ప్రపంచ బ్యాంకును ఆశ్రయించలే
- బ్యాంకుల ముందు మోకరిల్లుతున్న సీఎం రేవంత్ : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబర్ 18 : మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు సమాధానాలు చెబుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. పదేండ్లలో బీఆర్ఎస్ హయాంలో రుణం కోసం ఏనాడూ ప్రపంచ బ్యాంకును ఆశ్రయించలేదని పేర్కొన్నారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ప్రపంచ బ్యాంకు ముందు మోకరిల్లుతున్నారని విమర్శించారు. ఈ మేరకు మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై కల్వకుంట్ల కవిత కీలక విషయాలను బయటపెట్టారు. మూసీ పరివాహక ప్రాంతంలో పేద ప్రజల నుంచి భూములు లాక్కొని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టి రియల్ ఎస్టేట్ చేయాలని అనుకుంటున్నారని కల్వకుంట్ల కవిత విమర్శిం చారు. ఈ మేరకు ప్రపంచ బ్యాంకుకు సెప్టెంబర్ 19వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించిందని అన్నారు.

2వ పేజీలో...




## జల జీవన్ మిషన్ ద్వారా..

## ప్రతీ ఇంటికే మంచినీరు

### 55 లీటర్లు ఒక మనిషికి ఇచ్చేలా కార్యాచరణ
### డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

అమరావతి, డిసెంబర్ 18 : జల్ జీవన్ మిషన్ అమలుపై రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌ను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి పంపు, వాటి ద్వారా నాణ్యమైన మంచినీరు అందించాలనేది లక్ష్యమన్నారు. 2019 ఆగష్టులో ప్రారంభమైనప్పటికీ నీటిని అందించడానికే పరిమితం అయ్యిందని.. 2024 నాటికి మరింత బలోపేతం చేసి రోజూ నీటి సరఫరా చేయాలన్నారు. 55 లీటర్లు ఒక మనిషికి ఇచ్చేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మోడీ కలను మరింత సాకారం చేసేలా అడుగులు వేస్తున్నామన్నారు. నీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులు గుర్తించి పరిష్కారం చూస్తున్నామని.. అమృతధార ద్వారా లోపాలు, ఇబ్బందులు సరిచేసి మంచినీటిని అందిస్తామన్నారు. నేడు నీరు ఎంత ఎక్కువ తాగితే అంత మంచిది అంటున్నారని.. నీరు దొరకని సమయాల్లో మనకు ఆ విలువ ఏమిటో తెలుస్తుందన్నారు. పొలిటికల్‌గా ఆకాశం అంత పందిరి వేస్తాం అన్నట్లుగా హామీలు ఇస్తామని.. కానీ ఆచరణలో ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉందన్నారు. భీష్మ ఏకాదశిన 24 గంటలు మంచి నీళ్లు తాగకుండా ఉంటే ఆ ఇబ్బంది తెలుస్తుందన్నారు. "నేను ఈ శాఖ మంత్రిగా రివ్యూ చేస్తే... అనేక లోపాలు తెలిశాయి. ఈ పథకం అమలుకు ఒక్కో రాష్ట్రం ఒక్కో విధంగా లక్ష కోట్ల నుంచి 30 వేల కోట్ల వరకు అడిగారు. కేరళ 46 వేల కోట్లు అడిగితే.. మన ఏపీ మాత్రం 26 కోట్లే అడిగింది. మన రాష్ట్ర వాటా కూడా గత ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల జల జీవన్ మిషన్ అమలు కాలేదు. నేను కేంద్ర పెద్దలతో మాట్లాడితే వారు కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యం గురించి చెప్పారు. నాలుగు వేల కోట్లను సద్వినియోగం చేయలేక పోయింది. కేంద్ర ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా పని చేశారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించిన ప్రసన్న హరికృష్ణ...



**కరీంనగర్,** సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని ఆర్.డి.ఓ కార్యాల యం వద్ద చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె తొమ్మిదవ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు సంఘీభావం తెలిపేందుకు శిబిరం వద్ద గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ వచ్చి ఈ సందర్భంగా ప్రసన్న హరికృష్ణ మాట్లాడుతూ విద్యాశాఖ లో భాగంగా పని చేస్తూ, గత 9 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు చట్టబద్ధంగా నియమించబడ్డారు. వారిని రెగ్యులరైజ్ చేయండి లేదంటే పే స్కేల్ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్నటువంటి అన్ని వసతులు కల్పించాలి. వీరి న్యాయమైన డిమాండ్ లను ప్రభుత్వం అమలు చేయాలని నా యొక్క సంఘీభావం తెలుపుతూ సమ్మెలో పాల్గొనడం జరిగిందని 2023 లో ఇదే సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెను విరమింపజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు వీరి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాను. ఈ కార్యక్రమంలో గ్రామీణ సపోర్ట్ మేనేజర్ శ్రీనివాస్ లెక్చరర్స్ కిషోర్ ,రాజు, కిషన్, బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు నిమ్మ గణేష్ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

## అదానీ-మోడీ సంబంధం..

మొదటిపేజీ తరువాయి...

ఈ క్రమంలోనే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్నామని సీఎం చెప్పారు. ప్రభుత్వంలో ఉండి తాము చేస్తున్న ఈ నిరసన కొంత మందికి నచ్చొచ్చు, నచ్చకపోవచ్చని అన్నారు. అలాగే పార్లమెంట్‌లో అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాలని, అలా చేస్తూ అదానీ కచ్చితంగా జైలుకు వెళ్తారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అదానీ వ్యవహారంపై తెలంగాణ అసెంబ్లీలో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, సభలో అదానీ అంశంపై తీర్మానం చేసి పార్లమెంటుకు పంపుదామన్నారు.లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి సృష్టించారు: అదానీ-మోడీ సంబంధం దేశపరంగా ప్రతిష్టను దెబ్బతీస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ దేశంలో వ్యాపారాలు చేయాలంటే లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితిని మోడీ-అదానీ సృష్టించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అదానీ అవకతవకలపై జాతీయ పర్యవేక్షణ కమిటీ (జేపీసీ) ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. అదానీ విషయంలో ప్రధాని మోడీ కనీసం మాట్లాడటానికి కూడా సిద్ధపడడం లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ నేతలు, ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా ఈ వ్యవహారాన్ని రాజ్యసభలో లేవనెత్తాలని కోరారు. వారు చేయరు.. మేము చేస్తే తప్పు పడతారు: ఈ ధర్నాలో బీఆర్ఎస్ పార్టీపై కూడా సీఎం విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ నేతలు చెయ్యరు%ౌ% తాము చేస్తే%ౌ% తప్పు పడుతారని ఆరోపించారు. తాము నిరసన చేస్తుంటే తమ్మల్ని అవహేళన చేస్తున్నారని, వాళ్ళు అదానీకి, మోడీ కి లొంగిపోయారని విమర్శించారు. ఇలాంటి నిరసనలను తప్పు పడుతున్నారని, బిఆర్ఎస్ కు కనీస నైతిక హక్కు లేదని ఆయన అన్నారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు, ఈ కార్యక్రమాన్ని దేశ భవిష్యత్తుకు, ప్రజల సంక్షేమానికి గల బాధ్యతగా చూడాలన్నారు.

## రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ గా పదవీ భాద్యతలు స్వీకరించిన దిల్ రాజ్

హైదరాబాద్, డిసెంబర్ 18 : రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ గా వి. వెంకట రమణ రెడ్డి ఏ దిల్ రాజు నేడు ఉదయం పదవీ భాద్యతలు స్వీకరించారు. మాసాబ్ ట్యాంక్ లోని ఎఫ్.డీ.సి కార్యాలయంలో నేడు ఉదయం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పదవీ భాద్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల స్పెషల్ కమిషనర్ డా. హరీష్ దిల్ రాజును పుష్పగుచ్చాలతో అభినందించారు. ఈ కార్యక్రమానికి పలువురు సినీ రంగ ప్రముఖులు హాజరై దిల్ రాజ్ ను అభినందించారు. పదవీ భాద్యతలు చేపట్టిన అనంతరం, తెలంగాణా రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజ్ మాట్లాడుతూ, తెలంగాణా లో ఫిలిం ఇండస్ట్రీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ఇండస్ట్రీ కి చెందిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత నివ్వనున్నట్టు ఆచెప్పారు. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ కి చెందిన షూటింగ్స్ తెలంగాణా లో మరింత ఎక్కువగా జరిగే విధంగా ప్రయత్నిస్తానని, తెలంగాణాకు చెందిన సినిమాల ప్రోత్సాహానికి ప్రాధాన్యత నిస్తామని తెలిపారు. అదేవిధంగా ఎక్సహిబిటర్స్ సమస్యల పరిష్కారంతో పాటు, సినీ నిర్మాతలకు షూటింగ్ ల అనుమతులను సింగల్ విండో ద్వారా లభించేందుకు కృషి చేస్తానని దిల్ రాజ్ పేర్కొన్నారు.

# ధరణి స్థానంలో భూ భారతి

ఇటువంటి అద్భుతచట్టాన్ని ప్రవేశపెట్టే అవకాశం తనకు లభించడం మరచిపోలేని విషయమని అన్నారు. 1971లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్వోఆర్ చట్టం 49 ఏళ్లపాటు ఉపయోగపడిందని, ముఖ్యంగా రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏడేళ్ల పాటు కూడా ప్రజోపయోగంగా ఉపయుక్తమయ్యిందని తెలిపారు. తర్వాత అర్ధరాత్రి నాలుగు గోడల నడుమ రూపొందిన ధరణి చట్టం వలన సమస్యలు పరిష్కారం కాకపోగా లక్షలాది సమస్యలను తెచ్చిపెట్టిందని చెప్పారు. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడిందన్నట్లు ధరణి పోర్టల్‌తో లెక్కలేనన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, నాటి ప్రతిపక్షనేత , నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , నేటి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ పాదయాత్రల సందర్భంగా ధరణిని సముద్రంలో కలుపుతామని ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించారని మంత్రి పొంగులేటి తెలిపారు. ఆమేరకు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని, ఒక్క గుంట భూమి ఉన్న వారు కూడా తమను నమ్మారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకుగాను ఆర్వోఆర్ 2020ను పూర్తిగా ప్రక్షాళన చేసి భూభారతిని రూపొందించామని చెప్పారు. తాము ఆగస్టు 2న ముసాయిదాను ప్రవేశపెట్టడమేగాక ప్రత్యేకంగా 40 రోజుల పాటు వెబ్ సైట్‌లో పెట్టి ప్రజాప్రతినిధులు,కవులు , మేధావులు, విశ్రాంత అధికారుల సలహాలు సూచనలు స్వీకరించి కొత్త చట్టానికి రూపకల్పన చేశామని తెలిపారు. మాజీ మంత్రి హరీష్ రావు 7 పేజీలు, వినోద్‌రావు 5 పేజీల సలహాలు . సూచనలు చేశారని వాటిని కూడా పరిగణనలోకి తీసుకున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. 33 జిల్లాలలో ఒక్కోరోజు ప్రత్యేక చర్చావేదికలు నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకున్నామని చెప్పారు. ధరణ కారణంగా ఎంతోమంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కేసముద్రం మండలం నారాయణపురంలో కె. రవి అనే ఎంపీటీసీ సభ్యులు భూ సమస్లలను బిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలందరి దృష్టికి తీసుకువెళ్లారని , ఏళ్ల తరబడి పరిష్కారం కాలేదని చెప్పారు. అంతేగాక సర్వేనెంబర్లు 149,150, 154,156, 168 తదతరాల్లోని 1398 ఎకరాల భూమి తరతరాలుగా అక్కడి గిరిజనుల సాగుబడిలో ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ధరణి -2020 ఆర్వోఆర్ చట్టం వచ్చాక వారి హక్కులకు భంగం వాటిల్లేలా సదరు భూములు అటవీ భూములని తేల్చిచెప్పారని దీంతో గిరిజనులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని మంత్రి వివరించారు. భూభారతి బిల్లుకు సంబంధించి 22-23 సార్లు అభిప్రాయాలు తీసుకున్నామని, అందువల్లే బిల్లు ప్రవేశపెట్టడంలో .జాప్యం

జీవితం ముడిపడి ఉంటుంది. తరతరాలుగా మనిషి జీవితానికి, భూమికి విడదీయరాని అనుబంధం ఉంది. భూమి పేదరికాన్ని దూరం చేస్తుంది. ఆత్మగౌరవంతో బతికే అవకాశాన్ని ఇస్తుంది. కష్టానికి తగిన ప్రతిఫలాన్ని ఇస్తుంది. గ్రామాల్లో భూమే ప్రధాన జీవనాధారం. భూమిని నమ్ముకుని బతికే కష్టజీవులను కంటికి రెప్పలా చూసుకునే బాధ్యత ప్రభుత్వాలది. కానీ గత ప్రభుత్వం దీన్ని విస్మరించింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1971లో తీసుకొచ్చిన ఆర్వోఆర్ చట్టం 49 ఏండ్లు విజయవంతంగా అమలైంది. ప్రజల అవసరాలే లక్ష్యంగా అసైన్డ్ లాండ్స్ మొదలు అనేక విధాన నిర్ణయాలను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని వివరించారు. కాంగ్రెస్ అంటేనే ప్రజలకు ఒక భద్రత, భరోసా. అందుకే ఇప్పటికీ ఇందిరమ్మను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటున్నారు. ధరణి కారణంగా భూ యజమానికి తెలియకుండానే చేతులు దాటిపోయేలా చేసింది. కాళ్ళకింద నేల కదిలిపోయినా పేదలు వారి ఆవేదనను చెప్పుకోడానికీ మార్గం లేకుండా చేసింది.ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మా సీఎం రేవంత్‌రెడ్డి గారి సూచన మేరకు ధరణి కష్టాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి భూ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేశాం. రెవెన్యూ చట్టాలను ఈ కమిటీ అధ్యయనం చేసింది. ప్రజల నుంచి చట్టం రావాలనే ఉద్దేశంతో అదే రోజున సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో కూడా ముసాయిదా బిల్లును అందుబాటులో ఉంచాం. దాదాపు పాతిక రోజుల పాటు ప్రజా ప్రతినిధులు, రైతుసంఘాల ప్రతినిధులు, మేధావులు, సామాన్య ప్రజానీకం, రిటైర్డ్ అధికారుల నుంచి సలహాలు, సూచనలను స్వీకరించాం. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు సదస్సులు నిర్వహించి అభిప్రాయాలను స్వీకరించారు. చివరకు 2020 చట్టంలో ప్రధాన పాత్ర పోషించిన తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్ సూచనలు కూడా స్వీకరించాం. ఒక చట్టం మీద ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరించడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం. భవిష్యత్తులో భూ వివాదాలకు తావు లేకుండా ఎంజాయ్‌మెంట్ సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం చేస్తామని అన్నారు. రిజిస్ట్రేషన్ దస్తావేజుల ద్వారా వచ్చే మ్యుటేషన్ జరిగేటప్పుడు ఏవైనా తప్పులు జరిగితే అప్పీల్ చేసుకునే వ్యవస్థ (అథారిటీ)ని ఏర్పాటు చేస్తున్నాం. ఏదైనా పనికొచ్చేదున్నదంటే... రిజిస్ట్రేషన్, ఆ వెంటనే మ్యుటేషన్ జరిగే వెసులుబాటే. కానీ దురదృష్టవశాత్తూ తప్పులకు పరిష్కారం చూపే వ్యవస్థ లేదు. సేల్ డీడ్, వారసత్వం ... కాక కోర్టు ద్వారా వచ్చే, ఓఆర్సీ, 38-ఈ తదితర మొత్తం 14 రకాల భూమి హక్కులపై మ్యుటేషన్ పవర్స్ ను ఆర్డీవో ....సాదా బైనామా ... : 2020 నవంబరు 10 వరకు ఆన్‌లైన్‌లో వచ్చిన సుమారు 9.24 లక్షల దరఖాస్తులకు పరిష్కారం... చూపుతామని అన్నారు. దేశంలో ప్రతీ పౌరుడికి ఆధార్ నెంబర్ ఎలా ఉంటుందో మన రాష్ట్రంలో భూములకూ భూధార్ నంబర్...

మొదటిపేజీ తరువాయి...

తెస్తామని అన్నారు. 2014కు ముందు రెవెన్యూ రికార్డుల నిర్వహణ, జమాబందీ ఎలా ఉండేదో ఇకపైనా అదే విధంగా కొనసాగిస్తాం. త్వరలోనే ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక అధికారిని నియమిస్తాం. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించింది. భూ వివాదాల గ్రీవెన్స్, అప్పీళ్ళ కోసం లాండ్ ట్రిబ్యునల్స్ ఏర్పాటు... అవసరాన్ని, ప్రాంతాన్ని బట్టి సంఖ్యపై ప్రభుత్వ నిర్ణయం...ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆస్తుల్ని, రికార్డుల్ని ఉద్దేశపూర్వకంగా ఎవరైనా తారుమారు చేస్తే సీసీఎల్ఏ ద్వారా రివిజన్ చేసుకునే ఆప్షన్ ను ఈ చట్టంలో పొందుపరుస్తున్నాం. ప్రభుత్వ అధికారులపై చర్యలు: ప్రభుత్వ ఆస్తుల్ని ఉద్దేశపూర్వకంగా తారుమారు చేసే అధికారులపై చర్యలు తీసుకుని శిక్షించే అధికారాన్ని ఈ చట్టం ద్వారా తీసుకొస్తున్నాం అన్నారు. 2014 కి ముందు పాస్ బుక్కులు కలిగి ఉండి అనుభవదారుడిగా పొసిషన్ లో ఉన్న వారు ధరణి తరువాత రోడ్డున పడ్డారు. గత ప్రభుత్వం ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించింది. భూ భారతిలో పట్టాదారులు, అనుభవదారులు అభద్రతాభావానికి గురి కావాల్సిన అవసరం లేదు. ఈ చట్టం వీరికి సముచిత స్థానం కల్పిస్తాం.రెవెన్యూ రికార్డులు టాంపరింగ్ జరగకుండా కంప్యూటర్ రికార్డులతో పాటు నిర్ణీత కాల వ్యవధిలో మాన్యువల్ కాపీని కూడా రెవెన్యూ కార్యాలయాలలో భద్రపరుస్తాం అన్నారు. గత ప్రభుత్వం కొన్ని వివరాలను బహిర్గతం కాకుండా లాకర్లలో బంధించింది. ఇప్పుడు భూ-భారతితో ఎవరైనా ఎక్కడి నుంచైనా చూసుకునేలా డిస్‌ప్లే చేస్తున్నాం. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతానికి గురికాకుం డా ఎవరైనా భూ భారతి ద్వారా ప్రభుత్వానికి తెలియ చేయవచ్చు. ఆ భూముల్ని పరిరక్షించేలా ఈ చట్టాన్ని రూపొందిస్తున్నాం. భూ-భారతిలో దరఖాస్తు చేసుకున్న భూములున్న ఆసాములకు వారి మొబైల్ నెంబర్లకే అప్‌డేట్స్ వెళ్ళే సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. గతంలో ధరణి కారణంగా అన్యాక్రాంతమైన భూముల వివరాలను భూ భారతి ద్వారా బట్టబయలు చేస్తాం. 2014కు ముందు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల దగ్గర ఉన్న ప్రభుత్వ భూముల జాబితాలోని రెవెన్యూ, ఎండోమెంట్, వక్ఫ్, భూదాన్, ఫారెస్ట్ తదితర భూముల వివరాలను ధరణిలోని డేటాతో పోల్చి చూసి అన్యాక్రాంతమైన భూముల వివరాలను బహిర్గతం చేస్తాం. ప్రభుత్వ భూముల్ని ఆక్రమించినవారు ఎంత పెద్దవారైనా వదిలేది లేదు. ఆ భూముల్ని తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతాం. రూల్స్ ఫ్రేమ్ అయిన తర్వాత గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు పెట్టి అధికారులతో పాటు నేను, సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి పరిష్కారాన్ని యుద్ధ ప్రాతిపదికన కనుగొంటాం.అందరికీ ఆమోదయోగ్యంగా తీసుకొస్తున్న భూ-భారతి చట్టం కనీసం వందేళ్ళు వర్ధిల్లుతుందని ఈ ప్రభుత్వం బలంగా నమ్ముతున్నదని మంత్రి వివరించారు.

# అదానీ వ్యవహారంపై జేపీసీతో విచారణ చేపట్టండి

**మాజీ సీఎం జగన్ ముడుపుల విషయాన్ని కూడా నిగ్గులేల్చండి**

**రాజ్‌భవన్ యాత్రలో వైసీపీ నేత వైఎస్ షర్మిల**

అమరావతి, డిసెంబర్ 18 : ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ వ్యవహారంపై వెంటనే జేపీసీ ఏర్పాటు చేసి విచారణ జరపాలని మోదీ ప్రభుత్వాన్ని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. అలాగే గౌతమ్ అదానీ వద్ద వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ముడుపులు తీసుకున్న వ్యవహారంలో ఏసీబీ రంగంలోకి దింపి విచారణ చేపట్టేలా ఆదేశించాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడలో గౌతమ్ అదానీపై చర్యలు తీసుకోవాలంటూ ఏఐసీసీ పిలుపు మేరకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో ఛలో రాజ్‌భవన్ యాత్ర చేపట్టారు. అయితే ఈ యాత్రను నగర పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసుల చర్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ.. అదానీ, వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మధ్య ముడుపుల వ్యవహారంపై నిజానిజాలు నిగ్గు తేల్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. స్వయంగా ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌కి అదానీ గ్రూప్ రూ.1,750 కోట్లు లంచం ఇచ్చారని అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ నివేదిక ఇస్తే.. కేంద్రంలో మోడీ కానీ.. రాష్ట్రంలో చంద్రబాబు కనీసం నోరు విప్పడం లేదంటూ వైఎస్ షర్మిల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ సైతం జరిపించడం లేదన్నారు. అదానీ మీద ఈగ కూడా వాలనివ్వడం లేదని కేంద్ర ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. ప్రపంచం ముంగిట దేశం పరువు, ఖ్యాతిని అదానీ తీస్తే.. ఆయన వద్ద లంచాలు తీసుకొని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరువు తీశారని మండిపడ్డారు. స్వలాభం కోసం విద్యుత్‌ను అధిక ధరకు కొనుగోలు చేసి.. జనం నెత్తిన రూ.1.50 లక్షల కోట్ల భారం వేశారని ఆరోపించారు. ఇదో పెద్ద కుంభకోణమంటూ గతంలో తెలుగుదేశం పార్టీ తీవ్ర ఆరోపణలు చేసిందని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం ప్రధాని మోదీకి, అదానీకి భయపడి టీడీపీ మౌనం పాటిస్తోందన్నారు. లంచం ఆరోపణలు వెల్లువెత్తినా.. గౌతమ్ అదానీ వ్యవహారంలో కేంద్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. అందుకు నిరసనగా ఛలో రాజ్‌భవన్ కార్యక్రమం చేపట్టాలని దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఏఐసీసీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సారథ్యంలో జరిగిన ఛలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఇక పక్క రాష్ట్రం తెలంగాణలో సైతం ఛలో రాజ్ భవన్ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్ సహచరులు సైతం హాజరయ్యారు.

## రాష్ట్రంలో చలి తీవ్రత

మొదటిపేజీ తరువాయి...



హైదరాబాద్, డిసెంబర్ 18 : రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. పలు ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచే చలి మొదలై.. ఉదయం 10 గంటల దాకా చలి తగ్గకపోవడంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జనం గజగజ వణికిపోతున్నారు. మంగళవారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల సాధారణం కంటే 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా హైదరాబాద్‌లో 6.2 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పటాన్‌చెరులో 7డిగ్రీలు, మెదక్‌లో 7.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో 11.9 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. శీతలగాలుల నేపథ్యంలో ఇప్పటికే ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. రానున్న రెండు రోజుల్లో చలి తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు.

## జల జీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికీ మంచినీరు

మొదటిపేజీ తరువాయి...

నీరు ఎలా తెస్తారో చూడకుండా పైపులు మాత్రం వేశారు. రిజర్వాయర్‌ల ద్వారా నీటిని తీసుకోవాల్సి ఉండగా.. వాటిపై దృష్టి పెట్టలేదు” అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చంద్రబాబు నాయకత్వంలో ఈ నీటి సరఫరాపై దృష్టి పెట్టామన్నారు. సీఆర్ పాటిల్ దగ్గర కూడా మన రాష్ట్రానికి రూ.76 కోట్లు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఆ ప్రాజెక్టు వివరాలు మొత్తం నివేదిక సిద్ధం చేసి జలశక్తి మంత్రికి అందజేయనున్నట్లు చెప్పారు. “పని చేయాలనే తపన ఉన్న అధికారులు మన రాష్ట్రంలో ఉన్నారు. నేను ఎక్కడకి వెళ్లినా పైపులు వేశారు.. నీళ్లు రావడం లేదని ఫిర్యాదులు చేశారు. గత ప్రభుత్వం 70.40 లక్షల గృహాలకు ఇచ్చినట్లు చెప్పారు. దీనిపై పల్స్ సర్వే చేస్తే 55.30 లక్షల మందికి మాత్రమే నీటి కుళాయిలు పెట్టినట్లు తేలిందన్నారు. ప్రతి జిల్లాలో నీటి సరఫరాకు ఉన్న ఇబ్బందులు, వనరులు తెలుసుకునేందుకు ఈ వర్కు షాపు ఏర్పాటు చేశాం. మోడీ కలలను సాకారం చేసేలా ప్రతి ఇంటికి మంచి నీరు అందించాలి. ప్రతి వ్యక్తికి 55 లీటర్లు ఇచ్చేలా జల జీవన్ మిషన్ ద్వారా పనులు చేయండి. మానవతా దృక్పథంతో అందరూ కలిసి పనిచేయాలి. పైపు లైన్లు డిజైన్‌లు కూడా గందరగోళంగా ఉన్నాయి. గొయ్యి తవ్వి పైప్ లైన్ వేయడం తప్ప.. నీటి సరఫరాపై గత పాలకులు దృష్టి పెట్టలేదు. వీటికి శాశ్వతమైన పరిష్కారం చూడాలి... తాగునీటిని అందించాలి” అని అన్నారు.

## ఆటో డ్రైవర్లను ఆదుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

మొదటిపేజీ తరువాయి...

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు 93 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనే ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల జాబితాను ఇచ్చామని పేర్కొన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వానికి దున్నపోతు మీద వాన పడ్డట్టే ఉందని అన్నారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి ఇస్తామన్న 12వేల రూపాయలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని.. బీఆర్ఎస్ పక్షాన వారికోసం పోరాడతామని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు, వారికి ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో చర్చించాలని ఇప్పటికే బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ప్రభుత్వ ముందుచూపు లేని విధానాల వల్ల రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఉపాధి అవకాశాలు కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ తమ వాయిదా తీర్మానంలో పేర్కొంది. కాబట్టి ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేసింది.

# మూసీ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు

మొదటిపేజీ తరువాయి...

ఆ ప్రతిపాదనల్లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అని స్పష్టంగా రాసి ఉందని తెలిపారు. కానీ మంత్రి శ్రీధర్‌బాబు మాత్రం మూసీ ప్రాజెక్టు కాదు.. మురుగునీటి శుద్ధికి సంబంధించి ప్రపంచ బ్యాంకు రుణాన్ని కోరామని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై ప్రభుత్వం తప్పుడు సమాధానాలు చెబుతోందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో రుణం కోసం ప్రపంచ బ్యాంకును ఆశ్రయించలేదని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను, హైదరాబాద్‌ను ప్రపంచ బ్యాంకుకు తాకట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచ బ్యాంకు ముందు రేవంత్ రెడ్డి మోకరిల్లుతున్నారని ధ్వజమెత్తారు. మూసీ పరివాహక ప్రాంతంలో పేద ప్రజల నుంచి భూములు లాక్కొని ప్రపంచ బ్యాంకుకు తాకట్టుపెట్టి రియల్ ఎస్టేట్ చేయాలని అనుకుంటున్నారని స్పష్టం చేశారు. “ప్రపంచ బ్యాంకుకు కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 19న ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ప్రతిపాదనల్లో స్పష్టంగా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ ప్రాజెక్టు అని స్పష్టం రాసుంది. కానీ మంత్రి శ్రీధర్ బాబు మాత్రం మూసీ ప్రాజెక్టు కాదు మరుగునీటి శుద్ధికి సంబంధించి ప్రపంచ బ్యాంకు రుణాన్ని కోరామని తప్పుడు విషయం చెప్పారు. రియల్ ఎస్టేట్, ల్యాండ్ పూలింగ్ చేసి పెద్ద పెద్ద భవంతులు కడుతామని ప్రతిపాదనల్లో స్పష్టంగా పేర్కొంది. డీపీఆర్ లు ఉన్నాయని ప్రపంచ బ్యాంకుకు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది. కానీ ప్రభుత్వం మాత్రం శాసన మండలిలో డీపీఆర్ లు లేవని చెప్పింది. డీపీఆర్ తయారు కాలేదని డిసెంబరు 17న చెప్పిన ప్రభుత్వం డీపీఆర్ ఉందని ప్రపంచ బ్యాంకుకు సెప్టెంబరు 19న తెలియజేసింది. అంతేకాకుండా, ప్రపంచ బ్యాంకుకు ప్రతిపాదనలు పంపిన తర్వాత అక్టోబరులో డీపీఆర్ తయారీకి కాన్సార్షియంను ప్రభుత్వం నియమించింది.” అని వెల్లడించారు.

జననినాదం

# సి.ఎం.కప్-2024 పోటీలలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

**• జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**



జననినాదం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:18: జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సి.ఎం. కప్ -2024 పోటీలలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సి.ఎం. కప్ -2024 పోటీలలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఆదర్శ గిరిజన పాఠశాల మైదానంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలను జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, జిల్లా యువజన క్రీడాభివఅద్ధి అధికారి ఆర్. రమాదేవితో కలిసి క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి వాలీబాల్, 800 మీటర్ల పరుగు పందెం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సి.ఎం. కప్ పోటీలలో భాగంగా జరుగుతున్న జిల్లా స్థాయి పోటీలను విజయవంతం చేయాలని తెలిపారు. గ్రామపంచాయతీ, మండల, మున్సిపల్ స్థాయిలలో పోటీలను ముగించుకొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ పోటీలలో జిల్లాలోని 15 మండలాలు, కాగజ్ నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీల జట్లు పాల్గంటున్నాయని, ఈ పోటీలలో 17 రకాల క్రీడా అంశాలకు సంబంధించి పోటీలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 27 నుండి జనవరి 2, 2025 వరకు హైదరాబాద్ లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీలలో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ప్రతిభను మెరుగుపరచుకోవడానికి దోహదపడతాయని, క్రమశిక్షణ అలవడడంతో పాటు దేహదారుఢ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. గెలుపు, ఓటములను సమానంగా తీసుకుని క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పోటీలలో పాల్గనాలని, 18 సంవత్సరాల వయసు ఉన్న గుకేష్ ప్రపంచ చెస్ ఛాంపియన్షిప్ పోటీలలో విజేతగా నిలిచి దేశానికే గర్వకారణంగా నిలిచాడని అన్నారు. క్రీడలు స్నేహభావంతో పోటీలలో పాల్గనాలని, ప్రత్యర్థి జట్టులోని క్రీడాకారులను గౌరవించాలని తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు చేసిన ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడాభివఅద్ధి అధికారి మీనారెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఫిజికల్ డైరెక్టర్లు, శిక్షకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గన్నారు.




# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**♦ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**



**జననినాదం,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి18:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. బుధవారం జిల్లాలోని సిర్పూర్- టి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వార్డును, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పారిశుద్ధ్య నిర్వహణ, రోగులకు అందించే భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రి




పరిసరాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం రోగులతో మాట్లాడుతూ వారికి అందిస్తున్న వైద్య సేవలు, భోజనం ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు కేశవరావు, మండల పరిషత్ అభివఅద్ధి అధికారి సత్యనారాయణ,హౌ డా. అనూష, సంబంధిత అధికారులు తదితరులు పాల్గన్నారు.

# ఇది నిలువెత్తు నిర్లక్ష్యం కాదా...?

- వందల మొక్కలను మొక్కుబడిగా విసిరేశారు
- మొర్రిగూడ నుండి లోయకు వెళ్ళే మార్గంలో పడేసి ఉన్న మొక్కలు
- సిర్పూర్(యు)లో పభుత్వ ఆసుపత్రి వేనుకా
- సిర్పూర్(యు), తిర్యాణి మండలాల్లో ఇలాంటి సిత్రాలెన్నో



**జననినాదం,సిర్పూర్(యు),తిర్యాణి 18:** పై రెండు చిత్రాలు చూశారు కదూ..! మొక్కల పెంపకంలో భాగంగా సరఫరా చేసిన మొక్కలివి. అయితే తమకేమీ పట్టనట్లు వాటిని ఇలా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇదెక్కడో మారుమూల గ్రామాలు కాదు సుమా..! సాక్షాత్తూ సిర్పూర్(యు) మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వెనకాల కనిపిస్తున్న సిత్రమిది. ఆసిఫాబాద్ జిల్లాలో ఎక్కడా పడితే అక్కడ వందల మొక్కలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. హరితహారంలో సామాజిక బాధ్యతగా నాటాల్సిన మొక్కల్ని ఇలా ఉన్నపళంగా మూలన పడేశారు. వేలు, లక్షలు దారబోసి మొక్కలు నాటాలని చెబితే మొక్కుబడిగా ఇలా వదిలేసి చేతులు దులుపుకున్నారు. ఎదురుగా కనిపిస్తే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయనే ఉద్దేశ్యమో.. ఉద్దేశ్యపూర్వకంతో కూడిన వ్యవహారమో ఏమోగానీ ఆసుపత్రి వెనకాల పడేసి మమ అనిపించారు. అదేవిధంగా తిర్యాణి మండలంలోనూ ఈ విధమైన వైఫల్యాలు కొట్టచ్చినట్టు కనబడుతున్నాయి. మండలంలోని ముర్రిగూడెం నుండి లోయకు వెళ్లే దారిలో ఓ పక్కకు వందల మొక్కలు పడేసి వాటి పట్ల దుందుడుకుగా తమ నైజాన్ని చాటుకున్నారు. పలు మండలాల్లో చిత్తశుద్ధితో ఆరా తీస్తే ఎన్ని వేల మొక్కలు చెత్త పాలు చేశారనేది



ఇట్టే విదితమవుతుంది. ఉన్నతాధికారులు గనుక పంపిణీ చేసిన మొక్కల లెక్కలు తేల్చితే అసలు డొల్లతనం బయటపడేది. అలాంటి పర్యవేక్షణ కొరవడింది కాబట్టే పచ్చదనం పరవాల్సిన మొక్కలు పనికి రాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా.. ఉన్నతాధికారులు కాస్త చొరవ తీసుకుంటే ఆశించిన లక్ష్యం కార్యరూపం దాల్చే అవకాశం ఉంటుందని పలు మండలాల ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.


# ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



**జననినాదం,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి17:** ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల ఇంటింట సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు.హౌబుధవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కొరకు గతంలో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇండ్ల యాప్ లో ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో భాగంగా ప్రతి 500 ఇండ్లకు ఒక సర్వే అధికారిని నియమించడం జరిగిందని, నిర్ణీత గడువులోగా సర్వే ప్రక్రియను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గన్నారు.

# మాకాడి వద్ద పెద్దపులి సంచారం

**రైలుపట్టాలు దాటుతుండగా గుర్తించిన స్థానికులు**



జననినాదం,నిర్మల్ జిల్లా ప్రతినిధి18:కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇటీవల పెద్దపులి సంచారం ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.కొద్ది రోజుల క్రితం కాగజ్ నగర్ మండలం గన్నారంలో ఓ యువతిపై దాడి చేసి హతమార్చిన పులి,మరుసటి రోజే దుబ్బగూడలో మరో రైతుపై దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా సిర్పూర్(టి) మండలం హుడ్కిలిలో దూడపై దాడి చేసింది.అనంతరం మాకాడి వద్ద రైలుపట్టాలు దాటుతూ కనిపించింది.స్థానికులుఈదఅశ్యాలను రికార్డ్ చేశారు. పులి సంచారంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.

# ఆత్మహత్యల నివారణలకు ప్రత్యేక చర్యలు

**♦ జిల్లా ఎస్పీ జానకి షర్మిల**



జననినాదం,భైంసా18:నిర్మల్ జిల్లా బాసర గోదావరిలో తరచూ జరుగుతున్న ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. బుధవారం బాసర గోదారి వద్ద ఘాట్స్ ను, బ్రిడ్జిని సిబ్బందితో కలిసి పరిశీలించి, మీడియాతో మాట్లాడారు. బ్రిడ్జి పై ఐదు ఫీట్ల వరకు జాలి లాంటి నిర్మాణం ఏర్పాటు చేస్తామని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీస్ కంట్రోల్ రూమ్ కి అటాచ్ చేసి 24/7 నిరంతర పరిశీలన చేస్తామని, రాత్రి వేళలో పెట్రోలింగ్ సమయాన్ని పెంచి, ప్రత్యేకంగా మహిళ పోలీసులను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అవసరం మేరకు నిజామాబాద్ సీపీ కో ఆర్డినేషన్తో పనిచేసి ఆత్మహత్య నివారణకు పాటుపడతామన్నారు. ఎస్పీతో ఏఎస్పీ అవినాష్ కుమార్, ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై గణేష్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలి


**♦ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**



**జననినాదం,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి18:** విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. బుధవారం సిర్పూర్-టి మండలం వేంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సకాలంలో అందించాలని తెలిపారు. సమ్మేటివ్ అసెస్మెంట్ కు సంబంధించిన 10వ తరగతి విద్యార్థుల ప్రగతి నివేదికలను పరిశీలించి, 10వ తరగతి విద్యార్థులకు భౌతిక శాస్త్రములో వారి పఠన సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులు ప్రతి రోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని, ఉదయము, సాయంత్రం వేళల్లో మరింతగా సాధన చేయాలని, ప్రత్యేక తరగతులలో విద్యార్థులు తమకు కలిగిన సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివఅత్తి చేసుకోవాలని, అప్పుడే 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. అభ్యాస దీపికలలో ఇచ్చినటువంటి ప్రతి ప్రశ్నను సాధన చేయాలని, వార్షిక పరీక్షలను ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందజేత

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



జననినాదం,మంచిర్యాల ప్రతినిధి18: జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా మంచిర్యాల,వరంగల్,ఖమ్మం,విజయవాడ జాతీయ రహదారి 163జి నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో బాధితుల కోల్పోయిన వివరాలను మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి 163జి 384 కిలోమీటర్ల మేర ఉంటుందని, రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లించడం జరిగిందని, ఆర్బిట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొదటి జాబితాలో పరిహారం అందని అర్హత గల వారు సంబంధిత పత్రాలు, బ్యాంక్ పాస్ పుస్తకాలతో సంప్రదించినట్లయితే రికార్డులు పరిశీలించి సరిగ్గా ఉన్నట్లు నిర్ధారణ జరిగితే సంబంధిత లబ్దిదారుల నుండి అక్విటెన్సీ తీసుకొని పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధరణి పోర్టల్ లో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, రాజస్వ మండల అధికారి పరిధిలోని దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**జననినాదం ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి19:** ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పాలనాధికారి రాజర్షి షా అన్నారు.జిల్లా కేంద్రం లోని భుక్తాపూర్ వార్డ్ నెంబర్ 44, 49 లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను జిల్లా పాలనాధికారి ఆకస్మికంగా సందర్శించి నమోదు చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేయర్లు ఇంటింటికీ తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ప్రజాపాలన లో దరఖాస్తులు చేసుకున్న అర్జీదారుల వివరాలను సేకరిస్తున్న తీరును పరిశీలించి గడువులోగా పూర్తి చేయాలని, రోజువారి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ రోజు ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేశారు, సర్వే సందర్భంగా యాప్ ద్వారా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, పొరపాట్లకు తావులేకుండా దరఖాస్తుదారుల వివరాలను ఆన్లైన్ మొబైల్ యాప్ లో జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహించకుండా ఈ నెలాఖరు లోగా సర్వే పూర్తయ్యేలా వేగవంతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ సీవీన్.రాజు, సర్వేయర్లూ, తదితరులు ఉన్నారు.

## ఆదివాసిగ్రామాల
# అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

**● జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి18:** జిల్లాలోని ఆదివాసి గ్రామాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ–ఉట్నూరు ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ లతో కలిసి ఆదివాసి నాయకులు, సర్ మెడీలు, పటేళ్లతో జిల్లాలోని 15 మండలాలలో గల గిరిజన గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు, రహదారులు, వంతెనల నిర్మాణాలు, వ్యవసాయం, విద్య, వైద్య రంగాలలో చేపట్టవలసిన పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆదివాసి గ్రామాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఆదివాసి గ్రామాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు రహదారులు, వంతెనల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఆ దిశగా అటవీశాఖ అనుమతుల కొరకు ప్రతిపాదనలు సమర్పించి సంబంధిత అనుమతులు పొందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో సి. సి. రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని, గ్రామాలలో విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాలల భవనాలు, ఉప కేంద్రాల నిర్మాణ పనులు, సమగ్ర గిరిజన అభివృద్ధి



సంస్థ పరిధిలోని పాఠశాలలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. గిరిజన గ్రామాలలో నెట్వర్క్ సేవలను మెరుగుపరిచేందుకు మారుమూల గ్రామాలలో మొబైల్ టవర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టడంతో పాటు మిషన్ భగీరథ పథకం ద్వారా మారుమూల గ్రామాల ప్రజలకు శుద్ధ జలం అందించేందుకు అధికారులు కృషి చేయాలని, అవసరం ఉన్నచోట రాయి సెంటర్ల భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్యగల భూ వివాదాలను పరిష్కరించేందుకు జాయింట్ సర్వే నిర్వహించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోడు భూములలో సాగు చేస్తున్న అర్హులైన గిరిజనులను గుర్తించి పోడు పట్టాలు అందించే దిశగా చర్యలు చేపట్టాలని, గిరిజనుల వ్యవసాయ రంగ అభివఅద్ధి దిశగా గిరివికాసం పథకం క్రింద బోర్లు, విద్యుత్ కనెక్షన్లు అందించడంతోపాటు గిరిజన ప్రాంతాలలో విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వం ఇటీవల పెంచిన డైట్, కాస్మటిక్ చార్జీల ప్రకారం నూతన మెనూ అమలు చేస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆదివాసి గ్రామాలలో చారిత్రాత్మక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, లీడ్ డిస్టిక్ మేనేజర్ రాజేశ్వరి జోషి, పంచాయతీరాజ్ ఈ ఈ ప్రభాకర్, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ, ఇంజనీరింగ్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువత చదువు పై దఅష్టి సారించాలి

**దళారుల మాటలతో మోసపోవద్దు**

**పోలీసులు మీ కోసం కార్యక్రమం లో పాల్గొన్నారు**

**● ఎస్పీ డివి శ్రీనివాస రావు**



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి18: యువత చదువు పై దఅష్టి సారించి తమ జీవితాలకు బంగారు బాటవేసుకోవాలని ఎస్పీ డివి శ్రీనివాస రావు అన్నారు. బుధవారం సిర్పూర్ (యు) మండలంలోని పవర్ గూడా గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ మీకోసం కార్యక్రమం లో ముఖ్యఅతిధిగా పాల్గొని అయన మాట్లాడారు. చదువు ద్వారానే అభివఅద్ధి సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ వారి కుటుంబంలో పిల్లలను పాఠశాలకు పంపడం ద్వారా వారి జీవితాలలో వెలుగు, భవిష్యత్తును మంచి భాటలు వేసిన వారవుతారని తెలిపారు. మారుమూలఆదివాసి గిరిజన గ్రామ ప్రజలకు, పోలీసులకు మధ్య సత్సంబంధాలు మెరుగుపరచాలని అన్నారు, ఆదివాసి యువత చదువుపై ప్రాధాన్యత కేటాయించి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలను సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. యువత ముఖ్యంగా మాదకద్రవ్యాల వ్యసనాల బారిన పడకుండా చదువుపై దఅష్టి సారించి తమ కుటుంబాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. రైతులు దళారుల మాయమాటలు నమ్మి మోసపోకుండా గంజాయి పండించడం,సేవించడం, అమ్మడం లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా జైనూర్, సిర్పూర్ యు, లింగాపూర్ మూడు మండలాలలో అధికంగా గంజాయి కేసులు నమోదు అవుతున్నట్లు తెలిపారు. యువత గంజాయికి బానిస కాకూడదని గంజాయి స్వీకరించడం ద్వారా కలిగే అనర్ధాలను పోలీసులు అనేక కార్యక్రమాల లో తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి కేసులో పట్టుబడినట్లయితే వారు కఠినమైన జైలు శిక్షలు



ఎదుర్కోవడంతోపాటు భవిష్యత్తులో కూడా అనేక సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. యువత వ్యసనాల బారినబడి తమ భవిష్యత్తును కోల్పోకుండా వాటికి దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. అదేవిధంగా సంఘవిద్రహ శక్తులకు ఎవరు సహకరించకూడదన్నారు. అలాంటి వారికి ప్రస్తుత సమాజంలో మనుగడ లేదన్నారు. మన ఊరిలో ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశించినప్పుడు వారి పట్ల అనుమానం కలిగినట్లయితే వెంటనే 100 కి డయల్ చేసి సమాచారం తెలియజేయాలని తెలిపారు. అదేవిధంగా ఆదివాసీలు అన్ని రంగాలలో అభివఅద్ధి చెందాలని, వారి అభివఅద్ధికి పోలిస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ మధ్యకాలంలో మనం ఎక్కువ చూస్తున్నా మోసాలలో సైబర్ నేరాలు ఎక్కువగా నమోదు అవుతున్నట్లు తెలిపారు. ఇటీవల కాలంలో ప్రతి ఒక్కరి చేతుల్లో ఆండ్రాయిడ్ మొబైల్ ఉంటుందని దాని ద్వారా సులభంగా హ్యాకర్లు డబ్బులు మన అకౌంట్ నుంచి మాయం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురి అయినట్లయితే వెంటనే 1930 కి కాల్ చేసి తెలియజేసినట్లయితే వారు నష్టపోయిన సొమ్మును తిరిగి వచ్చే ప్రయత్నంజరుగుతుందన్నారు. ఇటీవల కాలంలో మనం చూస్తున్న మరణాలలో ఆత్మహత్యలు ఎక్కువగా నమోదవుతున్నట్లు గుర్తించామన్నారు,ఎవరికైనా ఏదైనా సమస్య ఉంటే అధైర్య పడకుండా మానసికంగా దఅఢంగా ఉండాలన్నారు. పోలీసు వారు ఎల్లవేళలా తోడుగా ఉంటారని,, వీలైనంతవరకు సమస్యను పరిష్కరించేందుకు కఅషి చేయడం జరుగుతుందని తెలిపారు. వాసవి క్లబ్ వారి సహకారంతో ఆ గ్రామ చుట్టుపక్కల పేద ఆదివాసి మహిళలకు వఅద్ధులకు ఉచితంగా దుప్పట్లు,యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డిఎస్పి కరుణాకర్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, జైనూర్ సీఐ రమేష్, ఆత్రం భగవంత్‌రావు,చుట్టుపక్క గ్రామాల ప్రజలు, ఆదివాసీలు, పటేళు ,, సార్ మేడిలు,పోలీస్ సిబ్బంది లు పాల్గనడం జరిగింది.

# బాల్యవివాహ రహిత భారతదేశంగా కృషి చేయాలి

**గళం విప్పి చెపితే రక్షణ కల్పించేందుకు అందరు సిద్ధంగా ఉన్నాం**




**జననినాదం,ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి18:** ఆపదలో ఉన్న ఆడపిల్లలు ఎవరైనా గళం విప్పి చెబితే వారి వివరాలు గోప్యంగా ఉంచడంతోపాటు వారికి అన్ని శాఖల తరఫున రక్షణ కల్పించేందుకు పనిచేస్తున్నాయని జిల్లా బాలల హక్కుల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారిగూడ లోని మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలలో షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాల కార్మికుల నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిసిపిఓ రాజేంద్రప్రసాద్, మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ పవర్ యశోద, సఖి కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్, సిడిపిఓ వనజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిసిపిఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇంత కష్టమొచ్చినా చదువును మధ్యల ఆపివేయొద్దు అన్నారు. చదువులో, మరి ఏదైనా ఇబ్బంది వస్తే ధైర్యంగా తమ టీచర్లకు చెప్పుకోవాలన్నారు. ఆడపిల్లల రక్షణ కోసం 1098, 100, మహిళల కోసం 181 హెల్ప్ లైన్ నెంబర్లు, షీ టీం సభ్యులు 24 గంటల పాటు పనిచేస్తున్నాయన్నారు. పిల్లల కోసం ప్రత్యేక రక్షణ చట్టాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల్యవివాహాలతో జీవితం అక్కడే ముగిసిపోతుంది అన్నారు. ఇందుకోసం పిల్లలందరూ ఎట్టి పరిస్థితుల్లో నాయనా చదువులు మధ్యలో మానివేయకుండా చదువును పూర్తి చేయాలన్నారు. బలవంతంగా పెళ్లికి తల్లితండ్రులు, బంధువులు ఎవరైనా ఇబ్బంది చేసిన 1098 హెల్ప్ లైన్ నెంబర్ కు సంప్రదించాలన్నారు. సంప్రదించిన వారి పేర్లు ఎవ్వరికి చెప్పారని భరోసా కల్పించారు. అదిలాబాద్ జిల్లా విద్యార్థి ఇతర దేశాలలో సైతం చదువుకుంటున్నారని, కొందరు ఉద్యోగాలు చేస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ పవర్ యశోద, సఖి కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి మాట్లాడుతూ సఖి ద్వారా కల్పిస్తున్న సేవలను తెలియజేశారు. సఖి అంటే స్నేహితురాలని సఖి కేంద్రంలో అనేక రకాల సేవలు అందిస్తున్నారని తెలియజేశారు. భయపడకుండా 181,100,1098 కు టోల్ ఫ్రీ నెంబర్ కు సంప్రదించాలన్నారు. షూర్ ఎన్జీవో రూపొందించిన బాల్య వివాహ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పరిహిన్ సుల్తానా, షూర్ ఎన్జీవో డిస్టిక్ కోఆర్డినేటర్ కె. వినోద్, ఫీల్డ్ సూపర్వైజర్ తోట సుమలత, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ లక్ష్మి, అంగన్వాడి టీచర్ నిర్మల 200 మంది విద్యార్థులు ఉన్నారు.

# ధూప దీప నైవేద్య అర్చకులకు 25 వేల వేతనం అందించాలి



భూపాలపల్లి జననినాదం18: ధూప దీప నైవేద్య అర్చకులకు ప్రభుత్వం ప్రతినెల 25 వేల వేతనం అందించాలని ధూప దీప నైవేద్యం అర్చక సంఘం రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కార్యదర్శి కర్నె సాంబయ్య, జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ చార్యులు అన్నారు. ధూప దీప నైవేద్య అర్చకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ అర్చక వెల్ఫేర్ ఫండ్ సదుపాయాలను ధూప దీప నైవేద్య అర్చకులకు కూడా వర్తింపచేయాలని, ధూప దీప నైవేద్య అర్చకులకు ఆరోగ్య భద్రత కు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, తెలంగాణలోని అన్ని జిల్లాలలో అర్చకులకు అర్చన భవనం ఏర్పాటు చేయాలన్నారు, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే అర్చకులకు రాజకీయ వేధింపుల నుండి ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్ర దేవాలయాలలో ధూప దీప నైవేద్య అర్చకుల కుటుంబాలకు ఉచిత శిష్ట దర్శన భాగ్యాన్ని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి నంది శివకుమార్,జిల్లా ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గన్నారు.


# జిల్లాస్థాయిజూనియర్ బాల బాలికలు కబడ్డీ ఎంపిక

**కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఇంచార్జి ఆత్రం ధర్మారావు**

**జననినాదం, సిర్పూర్(యు)18:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 తేదీ గురువారం రోజున స్పోర్ట్ మోడల్ స్కూల్ గర్ల్స్ ఆసిఫాబాద్ మైదానంలో జూనియర్ విభాగంలో బాలబాలికలకు జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఇంచార్జ్ ఆత్రం ధర్మారావు తెలియజేశారు,ఈ క్రీడా పోటీలు 20 సంవత్సరముల లోపు 12.01.2005 తరువాత జన్మించిన బాలూరు 70%కిలో బాలికలు 65కేజీ అర్హులని వారు వివరించారు, ఈ పోటీలలో ఎంపికైన జట్లు బాలికలు ఈనెల 22 నుండి 25తేదీ వరకు హకీంపేట్ శమీర్ పేట్,జిల్లా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో స్పోర్ట్ స్కూల్ ప్రాంగణంలో బాలురు 27నుండి 30 ప్రెస్టన్ స్కూల్ గౌండ్ జనగాం నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తారని ఈ సందర్భంగా వారు తెలియజేశారు, ఈ ఎంపిక పోటీలలో పాల్గనే క్రీడాకారులు వారి యొక్క వయసు ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డు, స్కూల్ బోనఫైడ్ తో 100 రూపాయలు ఎంట్రీ ఫీజు తీసుకొని ఉదయం 11.00 గంటలకు పి ఇ టి టేకం. చంద్రశేఖర్ కి రిపోర్టు చేయాలని అన్నారు,ఇతర వివరముల కొరక 9441734946, 7569183304 నంబర్లకు సంప్రదించగలరని వారు సూచించారు.

# అర్హులైన భూ నిర్వాసితులకు సరైన నష్ట పరిహారం అందించాలి

**-మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందించిన సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**



మంథని డిసెంబర్ 18:నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హై వే కింద భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు సరైన నష్ట పరిహారం అందించాలని కోరుతూ ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధరబాబు కు మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ వినపతిపత్రం అందజేశారు. బుధవారం హైదరాబాద్ లోని మినిష్టర్ క్యాంప్ కార్యాలయంలో మంథని మండలం పుట్టపాక గ్రామానికి చెందిన సుమారు 20మంది భూ నిర్వాసిత బాధిత రైతులతో మర్యాద పూర్వకంగా మంత్రిని కలిసి ఇక్కడి రైతుల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. భూ నిర్వాసిత రైతులకు నష్టం జరగకుండా నిజమైన రైతులకు పూర్తిస్థాయిలో నష్ట పరిహారం అందించాలని ఆయన మంత్రి శ్రీధర్ బాబును కోరారు. అర్హులైన రైతులందరికి ప్రభుత్వం ద్వారా సరైన నష్ట పరిహారం అందేలా తగు చర్యలు చేపడతానని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ వెంట పుట్ట పాక గ్రామానికి చెందిన పోరెడ్డి తిరుపతి రెడ్డి, చాట్లపల్లి సంతోష్, శీలం ప్రభాకర్, సవాయి గణేష్, ఈసంపల్లి చంద్రమూర్తి, మిట్ట రాజశేఖర్, రేసు అచ్చిబాబు, రొడ్డ సాయి కృష్ణ, రైతులు ఉన్నారు.

# కేంద్ర మంత్రి ప్రయాణిస్తున్న విమానం దారి మళ్లింపు

అమరావతి,డిసెంబర్ 18 : కేంద్ర రక్షణ సహాయ మంత్రి సంజయ్‌సేథ్ ప్రయాణిస్తున్న విమానానికి వాతావరణం అనుకూలించకపోవడంతో ముందు జాగ్రత్తగా విమానాన్ని హైదరాబాద్‌కు దారి మళ్లించారు. నౌకాదళం హైడ్రో గ్రాఫిక్ సర్వేల కోసం ఉద్దేశించిన ఐఎన్ఎస్ నిర్దేశక్ నౌకను విశాఖ నావెల్ డాక్ యార్డ్‌లో ఉదయం జరగనున్న కార్యక్రమానికి జాతికి అంకితం చేసే కార్యక్రమానికి ఆయన విమానాశ్రయంలో బయలు దేరారు. విమానంలో సాంకేతిక లోపం ఏర్పడడంతో విమానాన్ని దారి మళ్లించడంతో కార్యక్రమాన్ని మధ్యాహ్నానికి వాయిదా వేశారు. కోల్?కత్తాలోని జీఆర్ఎస్ఈలో దేశీయంగా 80 శాతం పరికరాలతో ఐఎన్ఎస్ నిర్దేశక్ నౌక నిర్మాణం జరిగింది. 110 మీటర్ల పొడవు, 3800 టన్నుల బరువైన ఈ నౌకను రెండు ఇంజిన్లతో రూపకల్పన చేశారు. అత్యాధునిక హైడ్రో గ్రాఫిక్, ఓషనో గ్రాఫిక్ సర్వే పరికరాలతో ఈ నిర్దేశక్?ను తీర్చిదిద్దారు. హైడ్రోగ్రాఫిక్ సర్వేలకు సంబంధించిన రెండో నౌక ఇదే కావడం గమనార్హం. గతంలో 32 ఏళ్ల పాటు భారత నౌకాదళంలో సేవలందించి 2014లో వీడ్కోలు తీసుకున్న నిర్దేశక్ స్థానంలో ఈ కొత్త నౌక రూపుదిద్దుకుంది. 25 రోజుల పాటు నిరంతరాయంగా 18 నాట్ల గరిష్ట వేగంతో ప్రయాణించడం ఈ నౌక ప్రత్యేకత అని నౌక అధికారులు తెలిపారు.

# ఇక్కడ ఎవరూ తెలివి తక్కువ వాళ్ళు లేరు

**రేవంత్, అదానీ బంధం అందరికీ తెలుసు : మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, డిసెంబర్ 18 : తెలంగాణలో ఎవరూ తెలివి తక్కువ వాళ్లు లేరు, అందరికీ సీఎం రేవంత్‌రెడ్డి, అదానీకి ఉన్న బంధం తెలుసునని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు బయలుదేరినట్టుగా.. అదానీకి అన్ని రకాలుగా తోడు నీడగా ఉంటూ ఆయన కోసం కష్టపడుతున్న రేవంత్ రెడ్డి.. నేడు అదానీకి వ్యతిరేక ర్యాలీ ని తీయాలని అనుకుంటున్నాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. జైపూర్‌లో సరిగ్గా అతిథి మర్యాదలు జరగలేదోనో.. ఢిల్లీలో అపాయింట్‌మెంట్ దక్కలేదనో.. మొత్తానికి కొత్త నాటకానికి శ్రీకారం చుట్టాడు మన చిట్టినాయుడు అని కేటీఆర్ విమర్శించారు. భాయ్, భాయ్ అని వందల, వేల కోట్లు పంచుకున్న ముఖ్యమంత్రి.. అదానీ వ్యతిరేక రాలీ తీస్తున్నాడంట అని అన్నారు. నవ్వి పోదురు నాకేటి సిగ్గు అని.. రేవంత్ రెడ్డిని చూసే రాసుంటారని వ్యాఖ్యానించారు. మిమ్మల్ని ఎన్నుకున్నంత మాత్రం ప్రజలు మరీ అంత తెలివి తక్కువ వాళ్ళనుకుంటున్నావా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. లేక మళ్లీ మళ్లీ మోసం చెయ్యచ్చులే అనుకుంటున్నావా అని నిలదీశారు. దొంగే దొంగ అనడం నేడు కామన్ అయిపోయిందని చెప్పారు.

# బాసర బ్రిడ్జ్ పై రక్షణ ఏర్పాట్లు నిర్మల్ ఎస్ పీ జానకి షర్మిల

బాసర: బాసర గోదావరి నది బ్రిడ్జ్ ని జిల్లా ఎస్పి డా.జానకి షర్మిల బుధవారం సందర్శించారు. ఆమె వెంట భైన్సా ఏ ఎస్పి అవినాష్ కుమార్, ముధోల్ సీ ఐ మల్లేష్, బాసర ఎస్సై గణేష్ లున్నారు. తరువాత స్థానిక పోలీస్ స్టేషన్ లో పోలీస్ అధికారులతో కలసి రివ్యూ సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ నేను చార్జ్ తీసుకున్న గత సంవత్సరం నుండి బాసర బ్రిడ్జ్ పై ఆత్మహత్య లు నన్ను కదిలించాయి. ప్రభుత్వ సహాయం తో బాసర బ్రిడ్జి పై ఇరు వైపులాసుమారు ఆరు ఫీట్ల జాలిలు ,సిసి కెమెరా లు ఏర్పాటు చేసి బాసర పోలీస్ స్టేషన్ కి అనుసంధానం చేస్తాం.. 24/ 7 ఇద్దరు మహిళా కానిస్టేబుల్ లతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు బాసర బ్రిడ్జ్ పై బ్లూకోట్ సిబ్బందిని నియమిస్తాం. ఎల్లవేళలా గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంచి ఆత్మహత్య ల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని అన్నారు. బాసర బ్రిడ్జి పై సగ భాగం నిజామాబాద్ జిల్లా పరిధి లో ఉండటం తో నిజామాబాద్ సీపి తో మాట్లాడి వారి సమన్వయం తో ఆత్మహత్య లనివారణకు నిర్మల్ జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుబడి ఉందని అన్నారు.

# నేషనల్ హైవే పై దారి దోపిడీ..



పెబ్బేరు : వనపర్తి జిల్లా పెబ్బేరు శివారులోని పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఉన్న మూత్రశాలల వద్ద ఆగి ఉన్న వెహికిల్ పై గుర్తుతెలియని దుండగులు కత్తులు, రాళ్లతో దాడి చేసి 14 తులాల బంగారం చోరీ చేసి దారి దోపిడీకి పాల్పడ్డారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కూజన్ కొత్తూరు గ్రామానికి చెందిన 3 కుటుంబాలకు చెందిన 8 మంది తిరుపతి, అరుణాచలం తదితర తీర్థయాత్రలకు వెళ్లి తిరిగివస్తున్నారు. ప్రయాణం చేసి అలసిపోగా నిద్రపోదామని పెబ్బేరు శివారులోని పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఉన్న భారీ వాహనాలు నిలిపే స్థలంలో కారుని ఆపారు. అర్ధరాత్రి సమయంలో కొందరు దుండగులు అకస్మాత్తుగా కత్తులు, రాళ్లతో దాడి చేసి వెహికిల్లో ఉన్న 8 మంది వద్ద 14 తులాల బంగారం చోరీ చేశారు. వెహికిల్ టాప్ పైన ఉన్న బ్యాగులను ఎత్తుకెళ్లారు. బండిలో ఉన్న మగవారు దుండగుల పై ప్రతి దాడి చేయగా వారు రాళ్ళతో దాడిచేశారు. తెల్లవారుజామున 3:30 గంటలకు ఘటన జరిగింది. వెంటనే బాధితులు 100 కు డయల్ చేయగా స్పందించిన పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముగ్గురు తీవ్రంగా గాయపడగా మహిళలకు మెడల పై గాట్లు పడి స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పరిశీలించారు. వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్ రావు, సీఐ రాంబాబు, ఎస్సై హరిప్రసాద్ రెడ్డిలు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్ వారు రక్తపు మరకలు, వేలిముద్రలు వంటి వివరాలను సేకరించారు.

# కనీస మద్దతు ధరకు చట్టబద్ధత



**-రుణ మాఫీ కోసం పథకం**

**-వ్యవసాయ కార్మికుల కోసం జాతీయ కమిషన్**

**-జీవన వ్యయానికి అనుగుణంగా 'ఉపాధి' వేతనాలు**

**- కేంద్రానికి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల సిఫారసు**

న్యూఢిల్లీ : పంటలకు అందిస్తున్న కనీస మద్దతు ధరలకు (ఎంఎస్‌పి) చట్టబద్ధత కల్పించి అమలు చేయాలని వ్యవసాయం, పశుసంవర్ధకం, ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని అన్నదాతలు, పలు రైతు సంఘాలు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కోరుతూ శంభు, ఖనౌరీ సరిహద్దుల వద్ద రైతులు ఆందోళన నిర్వహిస్తున్న సమయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ సిఫారసు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, జలంధర్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చెన్నీ నేతృత్వంలోని కమిటీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయం, రైతుల సంక్షేమానికి సంబంధించిన గ్రాంట్ల డిమాండ్లపై లోక్‌సభకు తన తొలి నివేదికను అందజేసింది. ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కల్పించాలన్న సిఫార్సును తన నివేదికలో కమిటీ చేర్చిందని లోక్‌సభ సచివాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

'దేశంలో వ్యవసాయ సంస్కరణలు, రైతుల సంక్షేమం కేంద్రంగా జరుగుతున్న చర్చలో ఎంఎస్‌పీల అమలు కేంద్ర బిందువుగా ఉన్నదని కమిటీ అభిప్రాయపడింది. ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కల్పిస్తే దేశంలో రైతుల ఆత్మహత్యలను తగ్గించవచ్చునని పేర్కొంది. రైతులకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడం, మార్కెట్‌లో నెలకొంటున్న అస్థిర పరిస్థితుల నుండి వారికి రక్షణ కల్పించడం, రుణ భారాన్ని తగ్గించడం ద్వారా ఆత్మహత్యల నుండి రైతులను కాపాడవచ్చు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కల్పించాలని కమిటీ సిఫారసు చేసింది' అని లోక్‌సభ సచివాలయం ఆ ప్రకటనలో వివరించింది.

**రుణమాఫీకి సిఫారసు:** రైతుల ఇక్కట్లకు, ఆత్మహత్యలకు రుణభారమే కారణమని అభిప్రాయపడిన కమిటీ అన్నదాతలు, వ్యవసాయ కార్మికుల రుణాలను మాఫీ చేసేందుకు ఓ పథకాన్ని ప్రవేశపెట్టాలని కేంద్రానికి సూచించింది. 2021-22, 2024-25 మధ్యకాలంలో వ్యవసాయం, రైతుల సంక్షేమ శాఖకు అధిక కేటాయింపులు జరిపినప్పటికీ కేంద్ర ప్రణాళికా వ్యయంలో ఈ శాఖ వాటా 3.53 శాతం (2020-21) నుండి 2.54 శాతానికి (2024-25) తగ్గిపోయిందని కమిటీ అందజేసిన గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్పాదకతను మెరుగుపరచడానికి వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కేంద్రాన్ని కమిటీ కోరింది. పిఎం -కిసాన్ పథకానికి అందిస్తున్న వార్షిక మద్దతును రూ.6,000 నుండి రూ.12,000కు పెంచాలని కూడా సిఫారసు చేసింది. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అందేలా చూడడానికి సాధ్యమైనంత త్వరగా జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, దీనివల్ల వారికి లభించాల్సిన హక్కులు దక్కుతాయని కమిటీ తెలిపింది.

**పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా లేని 'ఉపాధి' వేతనాలు:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) వేతనాలు పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా లేవని పార్లమెంటరీ ప్యానెల్ తెలిపింది. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ ప్యానెల్ మంగళవారం తన నివేదికను పార్లమెంట్ ఉభయ సభల్లో సమర్పించింది. ఈ పథకం కింద 2008 నుంచి చెల్లిస్తున్న వేతనాలపై ప్యానెల్ అధ్యయనం చేసింది. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ పనులను కార్మికుల 'చివరి ప్రయత్నం', ఫాల్ బ్యాక్ ఎంపిక అని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పేర్కొనడాన్ని ప్యానెల్ ఖండించింది. 'ఇలాంటి పేర్లతో తక్కువ వేతనాలు, ఆలస్యంగా చెల్లింపులు చేయడం కార్మికుల్ని నిరుత్సాహపరుస్తుంది. మెరుగైన వేతనాలు ఇచ్చే ప్రాంతాలకు వలస, పనికోసం వెళ్లడానికి ప్రేరేపిస్తుంది' అని ప్యానెల్ పేర్కొంది. ఉపాధి వేతనాల స్థిరీకరణ కోసం ఇప్పటి వరకూ బేస్ రేట్‌ను సవరించలేదని ప్యానెల్ విమర్శించింది. వినియోగదారుల ధరల సూచిక (సిపిఐ-ఎఎల్) ఆధారంగా బేస్ రేట్‌కు ఇంక్రిమెంటల్ విలువను జోడించాలని పేర్కొంది. బేస్‌రేటును సవరించడంపై అడిగిన ప్రశ్నకు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి నిర్దిష్ట ప్రతిస్పందన లేదా సిఫారసు లేకపోవడాన్ని ప్యానెల్ తప్పుపట్టింది. 'ఇటువంటి ముఖ్యమైన సిఫార్సుపై మౌనంగా ఉండటం, నిర్దిష్ట సమాధానం ఇవ్వకుండా దాటవేయడం 'ఉపాధి హామీ' మెరుగుదల కోసం నిర్వహిస్తున్న నిరంతర ప్రయత్నాలను బలహీనపరుస్తుంది' అని ప్యానెల్ పేర్కొంది.

# పింఛన్‌దారులపై పిడుగు

**భారీగా కోతకు కసరత్తు**

**సుమారు 3 లక్షలు రద్దయ్యే అవకాశం**



అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక పింఛన్లలో (ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు) భారీ ఎత్తున కోత పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమౌతోంది. ఖజానాపై భారాన్ని తగ్గించుకోవడమే లక్ష్యంగా ఈ దిశలో కసరత్తు చేస్తోంది. అనర్హులను గుర్తించే పేరిట ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 9,10 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాకు ఒక సచివాలయాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈ తనిఖీల్లో 26 సచివాలయాల పరిధిల్లో 563 మంది అనర్హులకు పింఛన్లు అందినట్లు గుర్తించారు. వీరికి నోటీసులు జారీ చేయాలని, సరైన సమాధానం చెప్పకపోతే ఆయా లబ్ధిదారుల పింఛన్‌ను 'హోల్డ్'లో పెట్టాలంటూ ఈనెల 17న సెర్ప్ సిఇఓ నుండి జిల్లాల అధికారులకు , మునిసిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఏలూరు జిల్లాలో ఒక సచివాలయం పరిధిలో 12 క్లస్టర్లలో 420 మంది పెన్షన్‌దారులు ఉండగా 400 మందిని తనిఖీ చేసినట్లు తెలిసింది. వీరిలో 13 మంది అందుబాటులో లేరు. 15 మంది అనర్హులుగా తేలినట్లు సమాచారం. మరో నాలుగైదు సచివాలయాల పరిధిలో కూడా దాదాపుగా ఇదే స్థాయిలో ఫలితాలు వచ్చినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 13 ప్రశ్నల ఆధారంగా ఈ కసరత్తు సాగింది. దీనినే ప్రాతిపదికగా తీసుకుంటే రాష్ట్ర వ్యాప్తంగాఉన్న 15,004 సచివాలయాల పరిధిలో 3 నుండి 3.50 లక్షల మంది పింఛన్లపై వేటు పడే అవకాశం ఉందని అంచనా! ఎలక్ట్రిసిటీ బిల్లు, నాలుగు చక్రాల వాహనాలు, ఒకే ఇంట్లో రెండు పెన్షన్లు, భూముల విస్తీర్ణం తదితర అంశాలను ప్రశ్నలలో ప్రభుత్వం చేర్చింది.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ముందు పెన్షన్లు పెంచుతాం

**కాంగ్రెస్ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు పెన్షన్లు పెంచుతాం.. అప్పటివరకూ పెంచమని మహబూబ్నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేసారు. రుణమాఫీ, ఫ్రీ బస్సుతో రైతులు, మహిళలు సంతోషంగా ఉన్నారని అయన అన్నారు.

# డిసెంబర్ 20న జాబ్ మేళా నిర్వహణ

## జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి

ఖమ్మం :డిసెంబర్ 18:జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకుప్రైవేట్ రంగం అయిన హెటరో నెక్సిటీ, ముత్తూట్ మైక్రోఫిన్ లిమిటెడ్ లో ఉద్యోగాలు కల్పించుటకు ఈ నెల 20న శుక్రవారం ఉదయం 10.00 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ., టేకులపల్లి) ఖమ్మం నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ లోని హెటరో నెక్సిటీ లో ప్రొడక్షన్ / సపోర్ట్ (20 ఖాళీలు), ఇంజినీరింగ్ / మెయింటనెన్స్ (50 ఖాళీలు), ప్రొడక్షన్ (110 ఖాళీలు) ఉద్యోగాలకు గాను, అలాగే ముత్తూట్ మైక్రోఫిన్ లిమిటెడ్ ఖమ్మంలో రిలేషన్ షిప్ ఆఫీసర్ (30 ఖాళీలు), బ్రాంచ్ క్రెడిట్ మేనేజర్ (5 ఖాళీలు), బ్రాంచ్ రిలేషన్ షిప్ ఆఫీసర్ (5 ఖాళీలు) ఉద్యోగాలు భర్తీ చేయుటకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపిక కాబడిన వారికి 10 వేల నుండి 35 వేల వరకు వేతనం ఉంటుందని, 18 నుండి 30 సంవత్సరాల వయస్సు గల ఇంటర్, ఐ.టి.ఐ. ఫిట్టర్, ఎలక్ట్రికల్, మెకానికల్, కెమికల్ డిప్లొమా, ఎం.బి. ఏ., ఏదేని డిగ్రీ అర్హత గల జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 8121040350, 9966077622 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

# కూల్చివేత జాబితాలో గులాబీ కార్యాలయం...

హైదరాబాద్, : బీఆర్ఎస్ పార్టీలో ఏం జరుగుతోంది? కీలక నేతలు ఎందుకు టెన్షన్ పడుతున్నారు? పార్టీ పగ్గాలపై వారసుల మధ్య అంతర్గత కలహాలు మొదలయ్యాయా? హైదరాబాద్ పై ఓవర్ల నిర్మాణం నేపథ్యంలో చాలామంది నేతల ఇళ్లు పోతున్నాయా? జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టిన సర్వేలో బీఆర్ఎస్ ప్రధాన ఆఫీసు ఉందా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. హైదరాబాద్ అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సిటీలో ట్రాఫిక్ నియంత్రించాలంటే ఫ్లైఓవర్ల నిర్మాణం ఒక్కటే సాధ్యమని భావించింది. అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు వేస్తోంది. ఫ్లైఓవర్లు ఎక్కడ నిర్మించాలనే దానిపై సర్వే మొదలుపెట్టేసింది జీహెచ్ఎంసీ. దానికి తగ్గట్టుగా మార్కింగ్ చేస్తూ పోతోంది. ఫ్లైఓవర్లకు సంబంధించి భూసేకరణకు నేపథ్యంలో దాదాపు 350 వరకు ఆస్తులు ప్రభావితమయ్యే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దాదాపు 90 నివాసాలకు మార్కింగ్ చేశారు అధికారులు. అందులో సినీ, రాజకీయ నేతల నివాసాలున్నాయి. అలా మార్కింగ్ చేసిన వాటిలో తొలుత టీడీపీ ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ ఇల్లు, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి, అల్లు అర్జున్ మామ ఇలా కొందరి నేతల ఇళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌కు చెందిన అరడజను నేతల ఇళు ఉన్నట్లు తెలుస్తోంది. జీహెచ్ఎంసీ సర్వే ప్రకారం అధికారులు ఆయా ప్రాంతాల్లో మార్కింగ్ చేస్తున్నారట. ఇళ్ల తొలగింపు జాబితాలో కొందరు కాంగ్రెస్ నేతలతోపాటు అరడజను మంది బీఆర్ఎస్‌కు చెందిన నేతలున్నారట. మాగ్జిమమ్ ఇళ్లు పోకుండా పార్కింగ్ ప్రాంతం తీసుకోవాలని ఆలోచన చేస్తున్నారట అధికారులు. అప్పటికీ కుదరని భావిస్తున్న నేపథ్యంలో ఆయా నేతలతో మంతనాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు చేపట్టిన అంతర్గత సర్వేలో బీఆర్ఎస్ పార్టీ ఆఫీసు (తెలంగాణ భవన్) సగం పోయే అవకాశముందని కొందరి అధికారులు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా ఆ ప్రాంతం డౌన్ ఉండడం ఒకటైతే, కొద్దిపాటి వర్షం పడితే నీరంతా అక్కడే ఉండిపోతుందని అంటున్నారు. దానికి ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలంటే అక్కడ మరో బ్రిడ్జి నిర్మాణం చేస్తే బాగుంటుందని అంటున్నారు. మూసీ పునరుజ్జీవన విషయంలో ఎలాగైతే ప్రజలను రెచ్చగొట్టారో అలాగే చేయాలన్నది కారు పార్టీ నేతల ఆలోచన చెబుతున్నారు. ఈ విషయం తెలిసి కొందరు కారు పార్టీ నేతలు సైలెంట్ అయ్యారు. మొత్తానికి కూల్చివేతల వ్యవహారం రాజకీయంగా దుమారం రేగడం ఖాయమనే చిన్నపాటి చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో బలంగా సాగుతోంది.

# మంత్రి శ్రీధర్ బాబు చొరవతో ఇంటర్నెట్ పనులు వేగవంతం.

కమాన్ పూర్డిసెంబర్ 18.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో శ్రీధర్ బాబు చోరువతో ఇంటర్నెట్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి మంథని ప్రాంతా అభివృద్ధి ప్రదాత ఈనెల 8వ తేదీన వరుచుగల్లా ప్రారంభించిన ఇంటింటికి ఇంటర్నెట్ పనులు అడవి శ్రీరాంపూర్ గ్రామంలో ముందుకు వెళుతున్నాయి. ఇంటింటికి కేబుల్ వైర్ లాగుతూ కనెక్షన్లు ఇవ్వడం జరుగుతుంది మొత్తం అడివి శ్రీరాంపూర్ గ్రామానికి ప్రతి ఇంటికి ఒక నెల రోజుల్లో కనెక్షన్లు ఇవ్వడం జరుగుతుందని టీవీ ఫైబర్ మరియు పయనీర్ కంపెనీ అధికారి వెంకట్ తెలిపారు.

# సంపాదకీయం

## పొంచి ఉన్న పొరుగు ముప్పు

బంగ్లాదేశ్ నిజ స్వరూపం ఇప్పుడిప్పుడే బయటపడుతోంది. తూర్పు పాకిస్తాన్ పేరును సార్థకం చేసుకోవాలని అనుకుంటుంది. యూనస్‌ని రబ్బర్ స్టాంప్ చేసి పాకిస్తాన్, బంగ్లాదేశ్ ఆర్మీ, గేమ్ అడుతున్నట్లు కనిపిస్తుంది. పాకిస్తానీయులు బంగ్లాదేశ్ వెళ్లడానికి సెక్యూరిటీ క్లియరెన్స్ ఎత్తేశారు. బంగ్లా పాకిస్తాన్‌కు దగ్గరౌతుందనడానికి ఇది పెద్ద నిదర్శనంగా కనిపిస్తోంది. ఇండియా సహకారంతో స్వతంత్ర దేశంగా అవతరించిన బంగ్లాదేశ్, భారత్‌కే ముప్పుగా మారుతుందనే సందేహం వస్తోంది. బంగ్లాదేశ్‌లో మధ్యంతర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు చూస్తుంటే.. భారత వ్యతిరేక పాకిస్తాన్‌కు మరింత దగ్గరవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయ్. విద్యార్థి ఉద్యమంతో మొదలైన బంగ్లాదేశ్ ఉద్రిక్తత.. తర్వాత, భారత వ్యతిరేక ఉద్యమంగా మార్పు చెందడం చాలా అనుమానాలను రేపింది. బంగ్లాదేశ్ మిలటరీ కనుసన్నల్లో ఏర్పాటైన యూనస్ మధ్యంతర ప్రభుత్వం దీనికి మరింత ఆజ్యం పోసింది. నోబుల్ శాంతి బహుమతి పొందిన ముహమ్మద్ యూనస్.. తన దేశాన్ని తీవ్రమైన అశాంతి దిశగా నడిపే నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా, యూనస్‌కి అధికారం వచ్చిన తర్వాత ఉగ్రవాదుల్ని పెంచి పోషించే పాకిస్తాన్‌కు బంగ్లాదేశ్ మరింత దగ్గరయ్యింది. పాకిస్తాన్ నాయకులతో పెరిగిన సంప్రదింపుల నుండీ పాక్‌తో చేసుకుంటున్న మిలటరీ ఒప్పందాల వరకూ చాలా అంశాల్లో పాక్-బంగ్లాదేశ్‌ల మధ్య బంధం బలపడుతూ ఉంది. బంగ్లాదేశ్ పాకిస్తాన్ నుండి భారీ సంఖ్యలో ఆయుధాలను కొనుగోలు చేసింది. దీని తర్వాత, కొన్ని రోజుల క్రితమే, బంగ్లాదేశ్- భారత్ సరిహద్దుల్లో అత్యంత బలమైన వార్ డ్రోన్లను మొహరించింది. నిఘా కోసం మాత్రమే పెట్టామంటూ బొంకింది కూడా. ఇక, తాజాగా, మిలటరీ ఆదేశాలతో నడుస్తున్న యూనస్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో పాకిస్తానీయులు బంగ్లాదేశ్ రావాలంటే సెక్యూరిటీ క్లియరెన్స్ తప్పనిసరిగా ఉండేది. అలాంటిది, ఇప్పుడు ఆ క్లియరెన్స్ ఏమీ లేకుండానే వీసాలకు అనుమతి ఇచ్చేశారు పాక్ ఉగ్రవాదులు కూడా స్వేచ్ఛగా బంగ్లాదేశ్‌లోకి అడుగుపెట్టడానికి ఎంట్రీ మరింత సులువుగా మార్చారు. బంగ్లాదేశ్ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని సెక్యూరిటీ సర్వీసెస్ విభాగం.. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఈ మేరకు సమాచారం ఇచ్చినట్లు ఆ దేశ స్థానిక మీడియా చెప్పింది. అయితే, ప్రభుత్వం నిర్ణయంపై అక్కడ నుండి ఎలాంటి కామెంట్లూ రాలేదు. గతంలో, తమ దేశంలోకి ఉగ్రవాదుల్ని రాకుండా అరికట్టడానికి చేసిన చట్టాన్ని ఇప్పుడు ఎందుకు ఎత్తేశారనే దానిపై ఎలాంటి విశ్లేషణా లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. 2019 నుండి.. పాకిస్తాన్ పౌరులు బంగ్లాదేశ్ వీసా పొందాలంటే బంగ్లా సెక్యూరిటీ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ నుండి "నో అబ్జెక్షన్" సర్టిఫికేట్ పొందాలి. ఆ సమయంలో పాకిస్తాన్-బంగ్లాదేశ్ మధ్య కొనసాగుతున్న రాజకీయ, దౌత్యపరమైన ఉద్రిక్తతల మధ్య భద్రతా ప్రోటోకాల్స్‌లో భాగంగా ఈ విధానం ప్రవేశపెట్టారు. అయితే, మహ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వంలో పాకిస్తాన్-బంగ్లాదేశ్ సంబంధాలను మెరుగుపరచడంలో భాగంగా ఈ విధానాన్ని రద్దు చేశారు. ఇకపై, సెక్యూరిటీ క్లియరెన్స్ అవసరం లేదంటూ నిర్ణయం తీసుకున్నారు. నవంబర్‌లో కరాచీ నుండి చిట్టగాంగ్‌కు నేరుగా కార్గో నౌకల తరలింపును బంగ్లాదేశ్ ప్రభుత్వం అనుమతించిన ఒక నెల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. డిసెంబర్ 3న, బంగ్లాదేశ్‌లోని పాకిస్తాన్ హైకమిషనర్ సయ్యద్ అహ్మద్ మరూఫ్, బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ అధినేత బేగం ఖలీదా జియాను తన ఇంటిలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల అనంతరం ఈ ప్రకటన రావడం చర్చకు దారి తీసింది. దేశ భద్రతకు అవసరమైన ఈ చర్యను మాఫీ చేయడంపై చాలా మంది విమర్శలు కూడా చేస్తున్నారు. ఖలీదా జియా బంగ్లాదేశ్ ప్రభుత్వంలో ఎలాంటి అధికారిక హోదాలో లేకపోయినప్పటికీ.. ఆమే సలహా మేరకే ఇది జరిగినట్లు కొందరు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో.. బంగ్లా ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్-ఉజ్-జమాన్ కనుసన్నల్లో గవర్నమెంట్ చీఫ్ సలహాదారుగా ఉన్న యూనస్ రబ్బర్ స్టాంప్‌లా వ్యవహరిస్తున్నారనే కామెంట్లు వస్తున్నాయి. ప్రస్తుతం, బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలపై ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ నేతృత్వంలో ఉగ్రవాదులు, ఛాందసవాదులను అనుమతించే "ఫాసిస్ట్ పాలన" నడుస్తుందని ఆరోపించారు. డిసెంబర్ 8న లండన్‌లో విదేశీ అవామీ లీగ్ మద్దతుదారుల సమావేశానికి వర్చువల్‌గా చేసిన ప్రసంగంలో హసీనా ఈ వ్యాఖ్యలు చేశారు. తన ప్రభుత్వాన్ని కూలదోసిన జూలై-ఆగస్టు అల్లర్ల వెనక యూనస్ "మాస్టర్ మైండ్" ఉందని కూడా ఆమె ఆరోపించారు. ఆగస్టు 5 నుండి, మైనార్టీలు, హిందువులు, క్రైస్తవులు, బౌద్ధుల ప్రార్థనా స్థలాలపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయనీ.. యూనస్ పాలనలో జమాత్, ఉగ్రవాదులు స్వేచ్ఛగా తిరుగుతున్నారంటూ విమర్శించారు. కాల్పులు, హత్యలకు పాల్పిడిన ఉగ్రవాదులు, నేరస్థులకు యూనస్ ప్రభుత్వం క్షమాభిక్ష కల్పిస్తోందని హసీనా ఆరోపించారు. హసీనా విడుదల చేసిన 37 నిమిషాల ఆడియో రికార్డింగ్‌ను బంగ్లాదేశ్ స్టూడెంట్స్ లీగ్, బంగ్లాదేశ్ అవామీ లీగ్ ఫేస్‌బుక్ పేజీలో షేర్ చేశారు. అయితే, ఈ కీలక పరిణామల మధ్య తాజాగా భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ డిసెంబర్ 9న ఢాకా పర్యటించారు. అక్కడ, యూనస్‌తో సమావేశమైన మిస్రీ? బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీల భద్రతపై ఆందోళనను తెలియజేశారు. "సాంస్కృతిక, మత, దౌత్యపరమైన ఆస్తులపై దాడులు చేయడం విచారకరమని" మిస్రీ, యూనస్‌కు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే, ఇటీవల, దేశ ద్రోహం కేసులో బంగ్లా పోలీసులు అరెస్ట్ చేసిన ఇస్కాన్ గురువు చిన్మోయ్ కృష్ణ దాస్ కేసును వాదించే న్యాయవాదిని కూడా కేసును వాదించకుండా నిరోధించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. దేశం చట్టపరమైన హక్కులను ఉల్లంఘిస్తుందని ఆరోపిస్తున్నారు. ఇక, బంగ్లాదేశ్‌లో ప్రస్తుతమున్న పరిస్థితిపై యూరోపియన్ యూనియన్ కూడా స్పందించింది. యూనస్ నేతృత్వంలో నడుస్తున్న ప్రభుత్వం చట్టపరమైన పాలనకు ప్రాధాన్యతనివ్వాలని, విధి విధానాలను గౌరవించాలని, దేశ పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడాలని కోరింది. బంగ్లాదేశ్‌లో మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలపై తీవ్రంగా స్పందించింది. ఏది ఏమైనప్పటికీ? భారతదేశానికి వ్యతిరేకిగా.. చైనాకు అనుకూలంగా ఉన్న బంగ్లా ఆర్మీ చీఫ్, జనరల్ వాకర్-ఉజ్-జమాన్ ఆదేశాలమేరకే మహ్మద్ యూనస్ ప్రభుత్వం నడుస్తుందనే వాదన గట్టిగా ఉంది. అందుకే, భారత్‌కు వ్యతిరేకంగా బంగ్లాదేశ్, పాకిస్తాన్‌కు దగ్గరౌతుందని నిపుణులు కూడా భావిస్తున్నారు.

Printed,PublishedandOwnedbyJADAVROHIDAS, PrintedatJADAVROHIDAS ,Associate printers,Padmanagar,Asifabad,Dist,Telangana-500001Publishedat,JANANINADAM,H..NO.12-27,Village;Fatkal , Mangi,Mandal;Lingapur,Dist:komaramBheem
(Asifabad),State Telangana-505001,Editor:JADAV ROHIDAS RNI No.TELTEL/2023/12314,Cell:9550100197,9490111460.